క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, వివిధ రకాల పూజలు జరిపించి పూలతో ప్రత్యేకంగా అలంకారించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం చేపట్టి పుష్పాభిషేకం చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేయించారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముగిసిన జడ్జి పదవీ కాలం



జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాది

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా కోర్టులోని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి రామిరెడ్డిగారి రాంభూపాల్ రెడ్డి పదవీ కాలం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 జనవరి నుంచి 2024 డిసెంబర్ వరకు 9368 ఎస్టీసీ (సమ్మర్‌ట్రైల్ కేసెస్)లను పరిష్కరించానని, ఈ కేసుల ద్వారా కక్షిదారుల నుంచి జరిమానా దాదాపు రూ.4కోట్లకు పైగా వసూలు చేశామన్నారు. రాష్ట్రంలోనే సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ద్వారా జరిమానాలు, ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించడంలో మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు ఆయనను ఘనంగా సత్కరించారు.


ప్రపంచ దేశాలు మెచ్చిన నేత మన్మోహన్‌సింగ్



మాజీ ప్రధాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ప్రపంచ దేశాలు మెచ్చిన నేత మన్మోహన్‌సింగ్ అని, దేశంలో నీతి వంతమైన పాలనను అందించి చరిత్రలో నిలిచిపోయారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, మాజీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు కొనియాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడిగా మన్మోహన్‌సింగ్ నిలిచారని, దేశానికి ఆయన చేసిన సేవలు అజరామరమని అన్నారు. నాయకులు మస్తాన్‌ఖాన్, ఎస్‌వైడీ ప్రసాద్, రవిబాబు, అబ్రహాం, సలాం పాల్గొన్నారు.


హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి



బస్సు యాత్రను ప్రారంభిస్తున్న మర్చెంట్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): విజయవాడలో ఆదివారం జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. శుక్రవారం కార్యక్రమంలో పాల్గొనేందుకు నంద్యాల రిటైల్ జనరల్ మర్చెంట్ అసోసియేషన్ సభ్యులు వంద మంది విజయవాడకు బయల్దేరారు. అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున, విశ్వహిందూ పరిషత్ నాయకుడు రాంప్రసాద్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు శేషసాయి, వెంకటేష్, మల్లేశ్వరప్ప పాల్గొన్నారు.

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి వేదోక్త పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం, ధ్వజస్తంభం వద్ద హారతి పూజలు చేశారు.

ఆశల సాగు



రూపనగుడి వద్ద సిద్ధంగా నారు, మాయలూరు సమీపంలో రెండవ పంట వరి సాగుకు ట్రాక్టర్‌తో దమ్ము సేద్యం చేస్తున్న రైతు, అల్లూరు సమీపంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఉయ్యాలవాడ : కోటి ఆశలతో అన్నదాత రెండవ పంటగా వరి సాగు చేసేందుకు సమాయత్తమయ్యాడు. కుందూనది తీరం వెంట 12 గ్రామాల్లో ఖరీఫ్ కింద 1,100 హెక్టార్లలో వరి సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, వరి పంట చేతికి అందే సమయంలో ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట దిగుబడులు నేలవాలి వడ్లు మొలకెత్తడంతో అన్నదాతలు అతలాకుతలమయ్యారు. దిగుబడులు తగ్గాయి, ఎకరాకు 35 బస్తాల్లోపు వచ్చాయి. మార్కెట్‌లో బస్తా ధర రూ. 1,400 నుంచి రూ. 1,500లకు పడిపోయింది. చివరకు ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రహదారులపై ఆరబెట్టుకుని విక్రయించేందుకు రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ సహాయం లేకపోవడంతో వరి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఎకరాలో పంట సాగుకు రూ.35 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. చివరికి చేతికొచ్చిన మొత్తాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నారు. అయినా నేలతల్లిని నమ్ముకున్న కష్టజీవి మళ్లీ పంట సాగుకు పూనుకున్నాడు. మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెండవ పంట సాగు కోసం మాయలూరు, రూపనగుడి, అల్లూరు, సుద్దమల్ల, పెద్దయమ్మనూరు, తదితర గ్రామాల్లో రైతులు మడులు సిద్ధం చేసుకోవడం, వరి నాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు.

కొనసాగుతున్న తిరుప్పావై పాశురం



డాక్టర్ దీవీ హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీభగవత్ సేవా సమాజ్, తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 19వ రోజు తిరుప్పావై పశురాలను డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు భక్తులకు వినిపించారు. అయన మాట్లాడుతూ స్వామికి ఆగ్రహం, అనుగ్రహం రెండూ ఉంటాయని, స్వామిలో ఉండే ఆగ్రహాన్ని అణిచి అనుగ్రహాన్ని ప్రదర్శింపజేసేది అమ్మావారేనన్నారు. శ్రీమన్నారాయణ తత్వాన్ని ఆచార్య బోధనల ద్వారా గ్రహించి ఇరువురినీ ఆశ్రయించాలంటూ గోదాదేవి గోపికలకు వివరించే సన్నివేశాన్ని భక్తులకు వివరించారు. డాక్టర్ రవీంద్రనాథ్, సూరయ్య, నరహరి నాగేశ్వరరెడ్డి, మధుసూదన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వం చేపట్టే సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపల్ టౌన్‌హాల్‌లో సచివాలయ సిబ్బంది, ఎంఎస్ఎంఈ, ఈ–కేవైసీ, మిస్సింగ్ సిటీజన్ డేటా, చైల్డ్ హాజరు సర్వేలపై సమావేశం నిర్వహించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి పొరపాట్లు జరగకుండా సర్వే చేయాలన్నారు. ఈనెల చివరిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. జవహర్‌బాబు, ఐపీఓ చంద్రశేఖర్, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటునందించాలి



శిక్షణకు హాజరైన హెచ్‌ఎంలు, యాజమాన్య కమిటీ సభ్యులు

దొర్నిపాడు: పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటునందించాలని మండల విద్యాధికారులు మనోహర్‌రెడ్డి, రామచంద్రయ్య సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, యాజమాన్య కమిటీ సభ్యులకు ఆవశ్యకత, బాధ్యతలు, అభివృద్ధి పనులపై మండల రిసోర్స్ పర్సన్స్ కిశోర్, తాహిర్, సుధాకర్, గురువయ్య ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు, యాజమాన్య కమిటీలు సమన్వయంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. అనంతరం వారి బాధ్యతలు, విధులు, హక్కుల గురించి వివరించారు.

డ్రాపౌట్స్‌ను తగ్గిద్దాం

శిరివెళ్ల: పాఠశాలల్లో డ్రాపౌట్స్‌ను తగ్గిద్దామని ఎంఈఓ శంకరప్రసాదు సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో హెచ్‌ఎంలు, పీఎంసీలకు ఒక రోజు వృత్యంతర శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు, రెగ్యులర్‌గా బడికిరాని పిల్లలను పాఠశాలలకు వచ్చేలా కమిటీలు చొరవ చూపాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా, నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుందామని చెప్పారు. ఎంఈఓ–2 నాగార్జునరెడ్డి, సీఆర్పీలు పుల్లయ్య, అన్సర్, గుర్రప్ప పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు మహమ్మద్‌గౌస్, జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, శానిటేషన్ కార్మికులతో సమానమైన వేతనాలు అందజేయాలన్నారు. జీవో 36 ప్రకారం మున్సిపాలిటీలో పని చేస్తున్న నాన్ పీహెచ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ రూ.21వేలు చెల్లించాలని కోరారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. యూనియన్ అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు రామకృష్ణ, ఆదాము, రామాంజనేయులు బసవయ్య, మురళీ, బాలదుర్గన్న పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాల మధ్య ప్రభుత్వాల చిచ్చు



సంఘీభావం తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

నంద్యాల(అర్బన్): రాజ్యాంగ బద్ధంగా చేయాల్సిన ఎస్సీ వర్గీకరణను తప్పుదోవ పట్టిస్తూ ఎస్సీ ఉపకులాల మధ్య ప్రభుత్వాలు చిచ్చు రేపుతున్నాయని మాలమహానాడు గౌరవాధ్యక్షుడు మేకల లింగస్వామి అన్నారు. ఈ రకంగా రాజ్యాంగానికి విలువ లేకుండా చేస్తున్న వైనాన్ని మేధావులందరూ గమనిస్తున్నారన్నారు. స్థానిక నిశాంత్ భవన్‌లో శుక్రవారం మాలమహానాడు రాయలసీమ యుద్ధ గర్జన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాలకులు ఒక వర్గానికి కొమ్ము కాస్తూ ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూర్ఖత్వాన్ని వీడి సమాజానికంతా ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 23న కర్నూలు ఎస్టీబీసీ గ్రౌండ్‌లో జరిగే మాలల గర్జనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సాంబశివుడు, మాధవస్వామి, వెంకటేశ్వర్లు, ఓబులేసు, పుల్లన్న, రవికుమార్, లక్ష్మి, రోజక్క పాల్గొన్నారు.

ఆలయ భూముల వద్ద మరోసారి సర్వే

మహానంది: మహానంది దేవస్థానం పరిధిలోని పెద్దనంది ఎదురుగా ఉన్న దేవదాయశాఖ, రైతుల భూముల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. మహానంది గ్రామానికి చెందిన లీలావతి, మరికొందరు పొలం రస్తా కోసం దరఖాస్తు చేసుకోవడంతో తహసీల్దార్ రమాదేవి, ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సర్వే చేయించారు. కాగా దరఖాస్తుదారులెవరూ హాజరు కాలేదు. అయినా అధికారులు హడావుడి చేయడం పట్ల పలు విమర్శలు వినిపించాయి. ఆలయ ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ నాగభూపాల్‌రెడ్డి, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున పాల్గొన్నారు.

సావిత్రీబాయి ఫూలేను ఆదర్శంగా తీసుకోవాలి



గోస్పాడులో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం



రుద్రవరంలో ఉపాధ్యాయినులను సత్కరించిన దృశ్యం

గోస్పాడు: సావిత్రీబాయి పూలే జయంతిని స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం ఎంఈఓ అబ్దుల్‌కరీం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయినులు వెంకటలక్ష్మమ్మ, రోసిలిన్, శకుంతల, శైలజ, రామభారతిని సన్మానించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుభాషిని, పీడీలు విశ్వనాథ్, సాల్మాన్ పాల్గొన్నారు.

రుద్రవరం: సావిత్రీబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోలని రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ,స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బరాయుడు విద్యార్థులకు సూచించారు.సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నో అడ్డంకులు వచ్చినప్పటికీ వాటిని అధిగమించి బాలికల కోసం 52 పాఠశాలలు స్థాపించిన ఆదర్శమూర్తి అని కొనియాడారు. ఎల్లావత్తుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని విజయలక్ష్మి, ఏపీమోడల్ పాఠశాల ఉపాధ్యాయిని వసంధర, కేజీబీవీ ఉపాధ్యాయిని భూలక్ష్మిని సత్కరించారు.

దొర్నిపాడు: సావిత్రీబాయి పూలేను ఉపాధ్యాయినులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆపస్ అధ్యక్షుడు గంగాధర్ అధ్యక్షతన జయలక్ష్మి, సరస్వతి, ఉమాదేవి, శివశంకరమ్మ, శాంతిలక్ష్మి టీచర్లను సత్కరించారు. ఎంఈఓ–2 రామచంద్రయ్య, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : సావిత్రీబాయి పూలే కృషి మరవలేనిదని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా స్థానిక మోడల్ స్కూల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోడల్‌స్కూల్, సుద్దమల్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినులు హిమబిందు, జయలక్ష్మిని సన్మానించారు.





నంద్యాలలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం,మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ మాధవీలత, కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణ డిగ్రీ కళాశాలలో..

నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సావిత్రీ బాయి పూలే జయంతిని కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ ఇంతియాజ్ అహమ్మద్, రత్నరామిరెడ్డి, మాధవరెడ్డి, సుస్మా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే..నారాయణ జూనియర్ కళాశాలలో సావిత్రీబాయి జయంతిని నిర్వహించారు.

శిరివెళ్ల: సమ సమాజానికి అక్షరాలు నేర్పిన సావిత్రీబాయి పూలే మహిళలకు ఆదర్శమని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. శుక్రవారం సావిత్రీ బాయి పూలే జయంతిని శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, మహదేవపురం, కోటపాడు గ్రామాల్లో నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

నంద్యాల(అర్బన్): సమాజంలో అసమానతలు రూపుమాపిన సామాజిక మహిళా ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న అన్నారు. స్థానిక పీఎంఆర్ కళాశాలలో శుక్రవారం పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి సంఘం నాయకులతో కలిసి నివాళులర్పించారు. జిల్లెల్ల శ్రీరాములు, నగేష్, పరమేష్, అరుణ, చంద్రకుమారి పాల్గొన్నారు.

చాగలమర్రి: మొదటి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే జయంతిని శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.



చాగలమర్రిలో పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు ఉద్యమాలు



రాష్ట్ర మహాసభల లోగోను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కిలెనిన్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల లోగోను ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకులు బాబాఫక్రుద్దీన్, షేక్‌రియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేసినా ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఉక్కు ఫ్యాక్టరీ కలగానే మిగిలిపోతుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కొత్త సంస్థలను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేస్తూ కార్పొరేట్ విధానాలను అవలంభించడం వల్ల దేశంలో నిరుద్యోగిత పెరిగిపోతుందన్నారు.ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వెంకట్, హరి పాల్గొన్నారు.

ఆలయాలు హిందూ సమాజానికి జీవనాడి

నంద్యాల(వ్యవసాయం): మానవుడిని మాధవుడిగా మార్చడంలో ఆలయాలు హిందూ సమాజానికి జీవనాడి అని విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావం నంద్యాల జిల్లా సభ్యుడు ఎర్రగుంట్ల రాంప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆయూష్ యోగా కేంద్రంలో యోగా సభ్యులకు హైందవ శంఖారావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయాలు అంటే భోజనశాల, ధర్మశాల, వ్యాయామ, యోగా, యాగ, యజ్ఞశాల అని ఇవన్నీ రుషులు అందించిన గొప్ప వ్యవస్థ అని, అందుకే ఆలయాలను శక్తి కేంద్రాలుగా భావిస్తారన్నారు. రాజకీయ నాయకులు తమ అధికార బలంతో భగవంతుడికి, భక్తుడికి మధ్య ఉన్న ధార్మికతను దెబ్బతిస్తున్నారు. ఆలయాల్లో వేసే కానుకలు మారుమూల గ్రామంలో ఉన్న మరుగుపడిన దేవాలయాల పునరుద్ధరణ కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు. దేవాలయాలు, సంస్కృతి సంరక్షించుకోవడం కోసమే హైందవ శంఖారావం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 5న విజయవాడలో జరిగే బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగా కేంద్రం నిర్వాహకుడు ఆనంద్‌గురూజీ, ధనుంజయ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రసాద్

ఆశాజనకంగా కంది

ఉయ్యాలవాడ : మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఈ ఏడాది విస్తారంగా సాగు చేసిన కంది పంట పూత, కాయ దశలో ఆశాజనకంగా ఉంది. అదే సమయంలో సాగు చేసిన మొక్కజొన్న, సీడు పత్తి, మినుము, మిరుప, వరి తదితర పంటలు అతివృష్టి, అనావృష్టి కారణంగా దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే తుపాన్ ప్రభావంతో కురిసిన కొద్దిపాటి వర్షాలకు కంది పంటకు అనుకూలించడంతో రైతుల్లో కొంత మేరకు ఆశలు రేకెత్తిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కంది పంట ఏపుగా పెరిగింది. గత ఏడాది మండలంలో 295 హెక్టార్లలో సాగు కాగా, ఈ ఏడాది 805 హెక్టార్లలో సాగైంది. ముఖ్యంగా ఉయ్యాలవాడ, హరివరం, ఆర్.పాంపల్లె, కొండుపల్లె, ఆర్.జంబులదిన్నె, నర్సిపల్లె, తదితర గ్రామాల్లో అధికంగా సాగైందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మరో 15 రోజులు వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 10 –15 బస్తాల వరకు దిగుబడులు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఉయ్యాలవాడ సమీపంలో పూత, కాయ దశలోనున్న కంది పైరు